క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని.. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని సీఎం నివాసంలో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావులతో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎంను ఎమ్మెల్యే కోరారు.

పనిచేసే వారికే గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యాచారం: పార్టీలో కష్టపడి పనిచేసే వారికే తగిన గుర్తింపు ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. యాచారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు జర్పుల విజయ్‌నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలను నమ్మడం లేదని, మోదీ పరిపాలన మెచ్చి బీజేపీ వైపే చూస్తున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా.. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని, అప్పుడే తగిన పదువులు లభిస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాష, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదయ్య, యాదగిరిరెడ్డి, మండల మాజీ అధ్యక్షులు రవీందర్, రాజు, నాయకులు జగదీష్, శ్రీశైలం ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన కొప్పు మల్లేశ్‌కు.. శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.51 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో బాధితుడికి చెక్కు అందజేశారు. సుభాష్, సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మెడికల్ కిట్ల పంపిణీ

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామంలో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో సమకూర్చిన మెడికల్ కిట్లను బీఆర్‌ఎస్ నాయకులు గర్భిణులకు అందజేశారు. నాయకులు శోభ, కుమార్, యాదయ్య, జంగయ్య, అశోక్, బాలరాజు, మహేశ్, గిరి, ఆశలు శమంత, అనిత ఉన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

యాచారం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని సమితి మండల అధ్యక్షుడు మూలి మహేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణే లక్ష్యంగా ఏర్పాటైన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో చట్టబద్ధంగా వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా జూలై 7న నిర్వహించే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించుకుందామన్నారు. సమావేశంలో సమితి జిల్లా ఇన్‌చార్జి ఉపేందర్, నాయకులు యాదగిరి, కొండల్, మహేధ్, సత్యం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్క నాటుతున్న కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఆమనగల్లు మున్సిపల్ కమిర్ శంకర్‌నాయక్ అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేజీబీవీలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నామని, ప్రజలు ఖాళీ స్థలాల్లో నాటాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లింక్‌రోడ్లకు మోక్షమెప్పుడో?

- కంకర తేలి.. ప్రమాదకరంగా మారి
- నరకప్రాయంగా ప్రయాణం
- ఏళ్లుగా వేధిస్తున్న సమస్య
- పట్టించుకోని పాలకులు, అధికార యంత్రాంగం



రాయపోల్ రోడ్డు దుస్థితి

ఇబ్రహీంపట్నం రూరల్: లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. కంకతేలి, గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ప్రమాదాలకు నిలయంగా మారి ప్రజలను ఆందోళన గురిచేస్తున్నాయి. ఏళ్లుగా సమస్య వేధిస్తున్నా పాలకులు, అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. దశాబ్దకాలంగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రహదారులు రూపం కోల్పోయాయి. కంకర తేలి, గుంతలు, కయ్యలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించలేని పరిస్థితని వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తరచూ వాహనాలు మరమ్మతులకు గురవడమే కాకుండా.. ప్రమాదాల బారిన పడుతున్నామని పేర్కొంటున్నారు.

రాత్రివేళలో కష్టం

ఇబ్రహీంపట్నం మండల పరిధి పోల్కంపల్లి నుంచి రాయపోల్ రోడ్డు, పోల్కంపల్లి నుంచి నెర్రపల్లి రోడ్డు, పోల్కంపల్లి నుంచి మన్నెగూడ రోడ్డు, ఎల్మినేడు నుంచి తిమ్మాపూర్ రోడ్డు, నెర్రపల్లి నుంచి మజీద్‌పూర్ రోడ్డు, తులేకలాన్ నుంచి ధర్మన్నగూడ రోడ్డు, కప్పపహాడ్ నుంచి తులేకలాన్‌రోడ్డు, నాగన్‌పల్లి నుంచి అనాజ్‌పూర్ రోడ్డు నామరూపాల్లేకుండా పోయాయి. పూర్తిగా కంకర, గోతులు, మట్టిదిబ్బలు దర్శనమిస్తున్నాయి. పగటి ప్రయాణం ఎలా ఉన్నా.. ఈ మార్గంలో రాత్రిపూట కష్టమని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఆటో, కారు కాదు కదా.. కనీసం ద్విచక్ర వాహనం నడవలేని దుస్థితి ఉందని వాపోతున్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా?



విజయవాడ జాతీయ రహదారి నుంచి కాలనీలకు వెళ్లే దారి దుస్థితి

అబ్దుల్లాపూర్‌మెట్: జాతీయ రహదారి విస్తరణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎల్‌బీనగర్ నుంచి దండు మల్కాపూర్ వరకు నిర్మాణ పనులు పూర్తి చేసినప్పటికీ.. అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి, ఇనాంగూడ కూడలి, రామోజీ ఫిల్మ్‌సిటీ మెయిన్ గేట్, గండిమైసమ్మ దేవాలయం సమీపంలో పనులు నిలిపివేశారు. అయినప్పటికీ మట్టిరోడ్డులో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి.. మధ్యలో నిలిపివేసిన రోడ్డు నిర్మాణం కాస్త కోతకు గురైంది. బురదకుంటగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు పడకముందే.. రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనాలు పాడవుతున్నాయి



పోల్కంపల్లి నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఆటో నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తున్నా. పోల్కంపల్లి నుంచి నాగన్‌పల్లి వరకు రోడ్డు బాగానే ఉంది. కానీ ఆక్టోపస్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు పూర్తిగా పాడైపోయింది. ఈ మార్గంలో వాహనం నడపాలంటే భయంగా ఉంది. బండ్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. చేసిన కష్టం రిపేర్లకే సరిపోతుంది. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయించాలి.

– రమేష్, ఆటో డ్రైవర్

త్వరలో మరమ్మతు చేయిస్తాం

చాలా రోడ్లు అధ్వానంగా మారాయి. వాటి మరమ్మతులకు నిధులు మంజూరు అయ్యాయి. టెండర్లు పూర్తయ్యాయి. గతంలో కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే మరమ్మతులు చేపడతాం. రవాణా మార్గం మెరుగు పరిచి, వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేస్తాం.

– శ్రీనివాస్, డీఈ, పంచాయతీరాజ్ శాఖ

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: ఇంజాపూర్ సబ్‌స్టేషన్ పరిధి ఆపిల్ అవెన్యూ ఫీడర్ పరిధిలో చెట్ల నరికివేత కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని ఏఈ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపిల్ అవెన్యూ కాలనీ, మిధాని కాలనీ, తిరుమలనగర్, బాలాజీ నగర్, వినాయకనగర్, సాయినాథ్ కాలనీ, సుందరయ్య కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరమ్మ కాలనీ, ప్రకాష్ నగర్‌లో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

➡ ఇందిర మ్మ కాలనీ ఫీడర్ కింద మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇందిరమ్మ కాలనీ, అంజనాపురి, అన్నపూర్ణ కాలనీ, శివాజీ నగర్, విరమని బిస్కెట్ కంపెనీ, సెయింట్ పాల్స్ స్కూల్ ఏరియా, డీఆర్‌ఎల్ కాలనీ, వశిష్ట కాలనీ, ఐలయ్య వెంచర్, శాంతి నగర్, మధురానగర్, డివిఆర్ కాలనీలో ఆటంకం ఉంటుందన్నారు.

➡ తుర్కయ ంజాల్ సబ్‌స్టేషన్ పరిధి శోభానగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మన్నెగూడ ఏరియా, శ్రీసాయి హ్యాపిహోమ్స్, హెవెన్స్ కార్నర్, ఎస్ఎస్ఆర్ కాలనీ, సాయిటౌన్ షిప్, అవివా హోమ్స్, ఎంఎంకుంట. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సినర్జీ హోమ్స్, ద్వారకానగర్, శోభానగర్, సిలికాన్‌నగర్, ఆపిల్ సిటీ, తుర్కయంజాల్ గ్రామం, ఏవీనగర్, వింటేజ్, యాదాద్రి హోమ్స్‌లో సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ రవీందర్ రెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇబ్రహీంపట్నం టౌన్‌లో

ఇబ్రహీంపట్నం: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఇబ్రహీంపట్నం టౌన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ అఖిలేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం టౌన్, అంబేడ్కర్ చౌరస్తా, చిన్నచెరువు, బీరప్ప టెంపుల్, త్రిశక్తినగర్, జంగాల బస్తీ, మంచాల రోడ్, గాంధీనగర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీజేపీ మండల జనరల్ సెక్రటరీగా హరీశ్‌రెడ్డి

మాడ్గుల: బీజేపీ మాడ్గుల మండల జనరల్ సెక్రటరీగా హరీశ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేసినందుకే.. అధిష్టానం తనను గుర్తించిందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తానని, పార్టీ శ్రేణులను కలుపుకొని, సమన్వయంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



కడ్తాల్: కర పత్రాలను ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు

- రసాయన ఎరువులు వాడొద్దు
- తుంపర సేద్యంపై దృష్టి సారించాలి
- వ్యవసాయ శాస్త్రవేత్తలు

కడ్తాల్: ప్రకృతిని పరిరక్షిస్తూ, ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ అనిత, డాక్టర్ సుప్రజ, డాక్టర్ శిరీషదీప్తి, డాక్టర్ సుజాత అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధి ఎక్వాయిపల్లి, ముక్తమాధారం గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రసాయన ఎరువులు వాడటం ద్వార భూమి ఫలదాయకత తగ్గిపోతుందని, భూమి నిస్సారమై బీడుగా మారే ప్రమాదముందన్నారు. అలాంటి పరిస్థితులను అధిగమించేందుకు వర్మి కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు వాడటం ఉత్తమమని, జీలుగ, జనుము కలియదున్నడం ద్వారా భూసార పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు.

రసీదులు తీసుకోవాలి

నీటీ ఎద్దడి పెరుగుతుండటంతో బిందు, తుంపర సేద్యంపై రైతులు దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఎరువులు, విత్తనాల కొనుగోలు చేసినప్పుడు రసీదులు తీసుకోవాలని, వాటిని భద్రపరుచుకోవడం ద్వారా ఆపత్కాలంలో పరిహారం పొందవచ్చని తెలిపారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సాగు మెలుకులు, నీటి యాజమాన్యం, భూసారం పెంపు, రసాయన ఎరువుల వాడకం, సాగు ఖర్చులు తగ్గించడం, పంట మార్పిడి, పర్యావరణ రక్షణ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. మహిళలకు చేతి కుట్లు, ఇతర ఆదాయ వనరులు ఏ విధంగా పెంపొందించుకోవాలో చెప్పారు. పర్యావరణ హిత వ్యవసాయంపై రైతులు అనుభవాలను తెలిపారు. కార్యక్రమంలో ప్రగతిశీల రైతు కృష్ణయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, ఏఓ శ్రీలత, ఏఈఓలు అభినవ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కశ్యప్, అనూష, రైతులు శ్రీనివాస్, చంద్రయ్య, రాములు, యాదగిరి, ప్రభాకర్‌గౌడ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ బట్టు కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి కోల్కులపల్లి గ్రామం రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు రసాయనిక ఎరువులు, పురుగు మందులను తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మురళీ, ప్రవీణ్, మండల వ్యవసాయ అధికారి అరుణ కుమారి, ఏఈఓలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలన.. ప్రపంచానికి ఆదర్శం

బీజేపీ నాగర్‌కర్నూల్ ప్రధాన కార్యదర్శి నాగరాజు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కడ్తాల్: ప్రధాని నరేంద్ర మోదీ పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని, దేశం అభివృద్ధి చెందిందని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధి మైసిగండిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మోదీ 11 ఏళ్ల పాలనపై పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యశాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి ఇప్పటి వరకు మోదీ దేశానికి సేవ చేస్తున్నారని తెలిపారు. ప్రజాసంక్షేమం, దేశ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత బియ్యం, స్వచ్ఛభారత్ అభియాన్, ముద్రబ్యాంకు, స్కిల్ ఇండియా మిషన్, పీఎం విశ్వకర్మ యోజన, నోట్ల రద్దు, ఆర్టికల్ 370, ట్రిపుల్‌తలాఖ్ రద్దు తదితర కార్యక్రమాలను చేపట్టారని వెల్లడించారు. గడిచిన దశాబ్ద కాలంపైగా అందించిన సేవలను ప్రజలకు వివరించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, లక్ష్మణ్ నాయక్, బాలకృష్ణగౌడ్, రెడ్యా, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి అమానుషం

- ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్న ఏపీ ప్రభుత్వం
- దాడులను ఖండించిన టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు



నిరసన వ్యక్తంచేస్తున్న జర్నలిస్టులు, నాయకులు

తుర్కయంజాల్: 'సాక్షి' కార్యాలయాలు, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు అమానుషమని, దాడులను ఖండిస్తున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా ఇన్‌చార్జి జగదీష్ అన్నారు. దాడులను వ్యతిరేకిస్తూ.. శుక్రవారం తుర్కయంజాల్ అంబేడ్కర్ కూడలిలో టీడబ్ల్యూజేఎఫ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సిలివేరు యాదగిరి, పల్లాటి జగన్‌ల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం కక్షపూరితంగానే జర్నలిస్టులపై వరుస దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. ఇది సరైంది కాదని, సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాస్‌పై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకుడు డి.కిషన్, బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర కోశాధికారి రమేష్‌లు మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడులను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీను, జర్నలిస్టులు మణి, శ్రీను, నగేష్, ఉపేందర్, వెంకటేశ్, సత్యం, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చేర్పించండి..

తుర్కయంజాల్: చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని సూపర్ వైజర్ కల్యాణి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అంగన్‌వాడీ టీచర్ స్వప్న ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవడంతో పాటు పోషకాహారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



చిన్నారులు, బాలింతలతో సూపర్ వైజర్ కల్యాణి తదితరులు

సమస్యల పరిష్కారమే.. భూభారతి లక్ష్యం

బాధితులు ఆందోళన చెందవద్దు

- రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోండి
- సత్వర పరిష్కారం పొందండి
- తహసీల్దార్లు సునీతారెడ్డి, లలిత, సుదర్శన్ రెడ్డి, అయ్యప్ప



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సునీతారెడ్డి



ఆమనగల్లు: శెట్టిపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ లలిత

ఇబ్రహీంపట్నం రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టం తెచ్చిందని, భూ బాధితులు ఎవరూ ఆందోళన చెందవద్దని తహసీల్దార్ సునీతారెడ్డి అన్నారు. అందులో భాగంగా ఊరూరా రైతు సదస్సులు నిర్వహిస్తుందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఆదిబట్లకు చెందిన భూ బాధితుడు మహేందర్.. తనకు సర్వే నంబరు 324, 323లో 37 గుంటల భూమి ఉందని, దానిని రెవెన్యూ అధికారులు ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తూ.. ఫిర్యాదు చేశారు. మొత్తం 28 అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. ఇందులో సర్వే నంబర్ మిస్సింగ్ 9, ప్రొహబిటెడ్ జాబితా నుంచి తొలగింపు 7, విరాసత్తు 4, భూసేకరణలో భూములు కోల్పోయిన వాటి గురించి 3 చొప్పున ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. కాగా.. సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సి తహసీల్దార్.. కొద్దిగా ముందు వెళ్లడంతో కొందరు ఫిర్యాదు దారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో ఈసీ శేఖర్‌గౌడ్, కోప్షన్ మాజీ సభ్యుడు గోపాల్‌గౌడ్, రాజు, దర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

తులేకలాన్‌లో 89 ఫిర్యాదులు

ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పలు రకాల సమస్యలపై 89 దరఖాస్తులు స్వీకరించారు.

భూ భారతితో మేలు

ఆమనగల్లు: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టం తెచ్చిందని, అందులో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ లలిత అన్నారు. కొత్త చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రైతు సదస్సులో ఆమె పలు దరఖాస్తులు స్వీకరించారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రైతు సదస్సులను రైతులు వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్యరాజు సూచించారు. శుక్రవారం మండల పరిధి కర్కల్‌పహాడ్ గ్రామంలో నిర్వహించిన సదస్సులో 73 దరఖాస్తులు స్వీకరించామని అధికారులు తెలిపారు. ఆర్ఐ రాజేందర్ రెడ్డి రెవెన్యూ సిబ్బంది, రైతులు ఉన్నారు.

యాచారంలో..

యాచారం: పెండింగ్ భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని భూ బాధితులు కోరారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన రైతు సదస్సులో తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో భూదాన్, సీలింగ్ భూముల సమస్యలున్నాయని, ఏళ్లుగా సాగులో ఉన్న వాటికి పట్టాదారు, పాసుపుస్తకాలు లేవని, కబ్జాలో ఉన్న అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బ్రహ్మయ్య, జంగయ్య, అబ్బయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: రెవెన్యూ సదస్సుల్లో అందిన ఫిర్యాదులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్, మన్నెగూడలో నిర్వహించిన సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 173 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు ఇంద్రాణి, రాంబాబు, సర్వేయర్ జ్యోతి పాల్గొన్నారు.

సర్కారు భూమిని కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుర్కయంజాల్: తుర్కయంజాల్, మన్నెగూడ రెవెన్యూ పరిధి ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని సంరక్షించాలని సీపీఎం మున్సిపాలిటీ కార్యదర్శి డి.కిషన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పలువురు నాయకులతో కలిసి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సుదర్శన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తుర్కయంజాల్‌లోని సర్వే నంబర్లు 52, 212, 279, 323, 399, 631, 637లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, డిజిటల్ సర్వే చేసి రక్షించాలని కోరారు. అదే విధంగా మన్నెగూడలోని 7, 8, 9,10లోని గంగరాయన్ చెరువుకి ఎన్‌ఓసీ తెచ్చుకుని వెంచర్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ 60 గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఆశీర్వాదం, శ్రీనివాసులు, కృష్ణ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీ ఆదిత్యరాజు



యాచారం: తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు



తుర్కయంజాల్: ఫిర్యాదులు అందుకుంటున్న తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి